సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 25 । మార్చి । 2025



**స్వర్ణమయానికి రూ.2.50 లక్షలు**
ద్వారకాతిరుమల: శ్రీవారి విమానగోపుర స్వర్ణ మయ పథకానికి విజయవాడకు చెందిన ఎన్.నర సింహారావు కుటుంబం సోమవారం రూ.2.50 లక్షలు విరాళంగా అందజేసింది.



**కళ తప్పిన కొల్లేరు**
కొల్లేరు నీరు లేక ఎండమావులను తలపి స్తోంది. నిండు కుండలా ఉండే కొల్లేరులో కనుచూపు మేర నీటి జాడ లేదు. దీంతో పక్షులు అల్లాడుతున్నాయి. 8లో

**రంజాన్ వేళలు**

| | ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం) | సహరి బుధవారం (ఉదయం) |
|---|---|---|
| భీమవరం | 6.21 | 4.43 |
| నరసాపురం | 6.22 | 4.42 |
| తాడేపల్లిగూడెం | 6.16 | 4.51 |

## న్యూస్‌రీల్

### క్షయ నివారణలో కృషికి అవార్డు



డీఎంహెచ్‌వో చేతుల మీదుగా అవార్డు అందుకున్న రవిబాబు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్ప త్రిలోని టీబీ విభాగ సీనియర్ ల్యాబ్ సూపర్‌వై జర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పంజా రవిబాబు బెస్ట్ అవార్డును అందుకున్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని జిల్లా క్షయ నివారణ కార్యాలయంలో సోమవారం జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ భానునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచే సిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో గీతాబాయి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

### ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ సిబ్బంది

భీమవరం : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాం డ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఫీల్డ్ లెవల్ సిబ్బందికి మినిమం స్కేల్, కేడర్, ఉద్యోగ భద్రత, ఎక్స్ గ్రేషియా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వంటివి అమలు చేయాలని అనేక సార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు కార్యాచరణ సిద్ధం చేశా మని, ట్రస్ట్ సీఈవో పిలుపు మేరకు వాయిదా వేసి 12న చర్చలో పాల్గొనగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి డి.రామ్మోహన్, డి.వెంకటరమణ, నాగ చార్యులు, తదితరులు పాల్గొన్నారు.

### పాలిసెట్‌కు దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్–2025 పరీక్ష ఏప్రిల్ 30న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించను న్నట్లు తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ డి.ఫణీంద్ర ప్రసాద్ వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 15 వరకు అందుబాటులో ఉంటాయని, దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీలకు రూ.100 రుసు చెల్లించాలని చెప్పారు. అభ్యర్థులకు తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిష్ణాతు లైన అధ్యాపకులచే ఏప్రిల్ 1 నుంచి పాలిసెట్ కోసం శిక్షణ అందజేస్తారని చెప్పారు. స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90102 22178, 94901 04336 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

### చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే బాధితుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో తక్ష ణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకో వాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 18 అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

### నాటు సారా అనర్థాలపై అవగాహన

భీమవరం: నాటు సారాతో అనర్థాలను ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రోహి బిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదగా నవోదయం- నాటు సారా నిర్మూలన కార్యక్రమంపై అవగాహన పోస్టర్, బుక్‌లెట్ ఆవిష్కరించారు. నాటు సారాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్ర మంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ వెంకటే శ్వర్లు, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత పాల్గొన్నారు.

# స్థానిక పదవులకు ఎన్నికలు

- రెండు ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీ, 15 ఉప సర్పంచ్ పదవులు ఖాళీ
- 27న ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- నోటీసుల జారీ చేసిన అధికారులు



సాక్షి, భీమవరం: జిల్లాలోని స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న రెండు ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీ, 15 మంది ఉప సర్పంచ్ పదవుల భర్తీకి ఈ నెల 27న ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే ఎంపీటీసీ, వార్డు సభ్యులకు అధికారులు నోటీసుల జారీ చేశారు. అత్తిలి, యలమంచిలి మండల పరిషత్‌లు గతం లోనే వైఎస్సార్‌సీపీ కైవసం కాగా సంఖ్యా బలం, జెంటిల్‌మెన్ ఒప్పందం మేరకు ప్రస్తుత ఎన్నికల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా వైఎస్సార్‌సీపీ సభ్యుల ఎన్నిక లాంఛనం కానుంది. జిల్లాలోని ఎంపీటీసీ స్థానాలకు 2021 ఏప్రిల్ 8న ఎన్నికలు జరగగా కోర్టు కేసులతో కౌంటింగ్ వాయిదా పడింది. తీర్పు అనంతరం సెప్టెంబరు 19న కౌంటింగ్ నిర్వహిం చగా 24న కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. ఎం పీపీ, వైస్ ఎంపీపీ పదవులకు పోటీ నెలకొన్న చోట రెండున్నర సంవత్సరాల చొప్పున జెంటిల్‌మెన్ ఒప్పందం ప్రకారం పదవిని సర్దుబాటు చేశారు. ఈ మేరకు అత్తిలి ఎంపీపీ, వైస్ ఎంపీపీ, యలమంచిలి ఎంపీపీ గత ఏడాది మార్చి నెలలో తమ పదవులకు రాజీనామాలు చేయడంతో ఖాళీ అయ్యాయి. వీటి భర్తీకి అప్పట్లో ఎన్నికలు జరపాల్సి ఉండగా ఎన్ని కల కోడ్‌తో ఆలస్యమైంది.

**వైఎస్సార్‌సీపీదే హవా**

తణుకు నియోజకవర్గం అత్తిలి మండలంలో 20 ఎం పీటీసీ స్థానాలకు 16 చోట్ల వైఎస్సార్‌సీపీ విజయం సాధించగా టీడీపీ, జనసేన రెండేసి స్థానాల్లో గెలుపొందాయి. ఎంపీపీ పదవి బీసీ జనరల్‌కు రిజర్వు కాగా ఒప్పందం ప్రకారం మొదటి రెండున్న రేళ్లు తిరుపతిపురం ఎంపీటీసీ సభ్యుడు మక్కా సూర్యనారాయణ ఎంపీపీగా, వైస్ ఎంపీపీలుగా మంచిలి ఎంపీటీసీ సభ్యురాలు దారం శిరీష, ఈడూరు ఎంపీటీసీ సభ్యుడు సుంకర నాగేశ్వరరావు పనిచేశారు. పదవీకాలం పూర్తికావడంతో సూర్యనా రాయణ, శిరీష రాజీనామా చేయగా నాగేశ్వరరావు ఇన్‌చార్జి ఎంపీపీగా సేవలందిస్తున్నారు. నాటి ఒప్పందం ప్రకారం అత్తిలి –1 ఎంపీటీసీ సభ్యు రాలు రంభ సుజాత ఎంపీపీగా, గుమ్మంపాడు ఎం పీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీనును వైస్ ఎంపీపీగా లాంఛనంగా ఎన్నుకోనున్నారు.

పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి ఎంపీపీ పీఠం జనరల్ మహిళకు రిజర్వయింది. మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలకు 14 చోట్ల వైఎస్సార్‌సీపీ, మూడు చోట్ల టీడీపీ, జనసేన ఒకటి గెలుపొందాయి. యలమంచిలి-1, ఏనుగువా నిలంక ఎంపీటీసీ సభ్యులు రావూరి వెంకటరమణ, వినుకొండ ధనలక్ష్మి ఎంపీపీ పదవిని ఆశించారు. పెద్దలు కుదిర్చిన ఒప్పందం ప్రకారం మొదట బాధ్యతలు చేపట్టిన రావూరి వెంకటరమణ రెండున్నరేళ్ల పదవీకాలం పూర్తికావడంతో గతం లోనే ఆమె రాజీనామా చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీపీగా వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎట్టకేలకు ఎంపీపీ ఎన్నిక జరుగనుండటంతో గత ఒప్పందం ప్రకారం ధనలక్ష్మిని ఎంపీపీని చేసే పనిలో వైఎస్సార్‌సీపీ నేతలు ఉన్నారు.

### 15 ఉప సర్పంచ్ పదవులకు ఎన్నిక

2021 ఫిబ్రవరి 13న పంచాయతీలకు ఎన్ని కలు జరగగా, మరుసటి రోజున కౌంటింగ్ జరిగింది. చాలావరకు పంచాయతీల్లో వైఎ స్సార్‌సీపీ సానుభూతిపరులే సర్పంచు లుగా గెలుపొందారు. ఆ సమయంలో ఎన్ని కల కోడ్ ఉండటంతో దాదాపు నెలన్నర రోజుల ఆలస్యంగా ఏప్రిల్ 3న కొత్త పాలక వర్గాలు కొలువుదీరాయి. అదేరోజున ఉప సర్పంచులను ఎన్నుకున్నారు. ఒప్పందం, ఇతర కారణాలతో పది మండలాల పరి ధిలోని 15 ఉప సర్పంచ్ పదవులకు ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిలో నరసాపురం మండలం లోని మల్లవరం, భీమవరం రూరల్‌లోని గొల్లవానితిప్ప, గూట్లపాడు, ఎల్‌వీఎన్ పురం, తుందుర్రు, బేతపూడి, అత్తిలిలోని కేఎస్ గట్టు, ఇరగవరంలోని కోతపాడు, మొగల్తూరులోని పేరుపాలెం సౌత్, పాలకొ ల్లులోని అగర్తిపాలెం, గోరింటాడ, ఉం డిలోని ఎస్ఆర్పీ అగ్రహారం, వీరవాసరం లోని పెర్కిపాలెం, యలమంచిలిలోని అబ్బి రాజుపాలెం, పాలకోడేరులోని గొరగన మూడి ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో 27న ఉప సర్పంచుల ఎన్నిక నిమిత్తం ప్రత్యేక సమావేశానికి హాజరుకావాలని వార్డు సభ్యులకు పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్నిక లాంఛనం కానుంది.

## రేషన్ బియ్యానికి ఎసరు

**ఈకేవైసీ పేరుతో 1.53 లక్షల మందికి ఝలక్**



పాలకోడేరు మండలంలో రేషన్ పంపిణీ దృశ్యం(ఫైల్)

భీమవరం : కూటమి ప్రభుత్వం రేషన్ కార్డుల ఈకేవైసీ పేరుతో రేషన్ బియ్యం ఎగవేసేందుకు రం గం సిద్ధం చేసింది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పేదలకు పెద్ద ఎత్తున రేషన్ కార్డులు పం పిణీ చేయడమే గాక కుటుంబ సభ్యులు, పిల్లల పేర్లు కార్డుల్లో నమోదు చేసుకోవడానికి ప్రత్యేక అవకాశం కల్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలుచేయకపోగా ఉన్న పథకాలకు ఎగనామం పెడుతోంది. గత పది నెలల కాలంలో ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేయ కపోవడంతో అనేకమంది కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కార్డుల్లో పేర్లు ఉన్న వ్యక్తులు ఈకేవైసీ చేయించుకోకపోతే వచ్చే నెల నుం చి కోటా బియ్యం కోల్పోనున్నారు.

**ఏప్రిల్‌లో 1.53 లక్షల మంది రేషన్‌కు ఎసరు**

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 5,58,300 తెల్ల రేషన్ కార్డులుండగా వాటిలో దాదాపు 15,67,322 మంది సభ్యులున్నారు. వారికి ప్రతి నెల 5 కిలోల చొప్పున రేషన్ బియ్యం అందుతోంది. రేషన్ పొం దుతున్న ప్రతి వ్యక్తి తప్పనిసరిగా ఈకేవైసీ చేయిం చుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో రేషన్ డీలర్లు రేషన్ కార్డుల్లో పేరున్న వారితో వేలిము ద్రలు వేయించుకుని ఈకేవైసీ చేస్తున్నారు. కొంత మంది ఉపాధి కోసం తాత్కాలికంగా వలస వెళ్లిన వారు, వృద్ధాప్యంలో ఉన్నవారు దూర ప్రాంతంలో ఉన్న తమ పిల్లల వద్దకు వెళ్లడం వంటి కారణాలతో ఈకేవైసీ చేయించుకోలేకపోయారు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు 14,13,923 మందికి ఈకేవైసీ పూర్తి కాగా 1,53,399 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. దీంతో వీరికి అందాల్సిన సుమారు 7.70 లక్షల కిలోల బియ్యానికి గండిపడ నుంది. ఈ మేరకు ఇప్పటికే రేషన్ డీలర్లకు కోత విధించి ఏప్రిల్ నెల బియ్యం పౌరసరఫరాల శాఖ పంపిణీ చేస్తోంది. ఈకేవైసీ చేయించుకోవాల్సిన వారు అత్యధికంగా భీమవరంలో 16,625 మంది ఉండగా తాడేపల్లిగూడెంలో 12,236 మంది, నర సాపురంలో 12,606 మంది, తణుకులో 11,690 మంది, మొగల్తూరులో 7,496, ఉండిలో 6,167, గణపవరంలో 5,601, యలమంచిలిలో 7,102, అత్తిలిలో 5,660, ఆచంటలో 5,512, పాలకో డేరులో 5,174, ఇరగవరంలో 6,599, ఆకివీడులో 6,372, కాళ్లలో 6,497, పెనుగొండలో 6,751, పోడూరులో 6,151, వీరవాసరంలో 5,809, పెనుమంట్రలో 5,028, పెంటపాడులో 4,836, పాలకొల్లులో 9,485 మంది ఉన్నారు.

## స్మార్ట్ మీటర్లతో ఉపాధికి గండి



ప్రకాశం చౌక్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్

భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ మీటరు రీడర్లను రోడ్డున పడేయవద్దని, వారికి సం స్థలోనే ప్రత్యామ్నాయం చూపి ఉద్యోగ భద్రత కలి ్పంచాలని విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రకాశం చౌక్ సెంటర్‌లో ఆందోళన చేపట్టి, కలెక్టరేట్ వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డిమాం డ్లతో కూడిన వినతి పత్రాన్ని మీకోసంలో జాయిం ట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి సమర్పిం చారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ నాడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి స్మార్ట్ మీటర్లను నేలకేసి కొట్టి పెడ బొబ్బలు పెట్టిన నారా లోకేష్ ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఎస్కో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని గతంలో సంస్థ సీఎండీ మీటర్ రీడర్స్‌కు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, ఎస్కో ద్వారా వేతనాలు ఇవ్వని కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. సబ్ స్టేష న్లలో ఐటీఐ అర్హత ఉన్న వారిని షిఫ్ట్ ఆపరేటర్‌గా, వాచ్ అండ్ వార్డ్‌గా నియమించాలని, సర్కిల్ ఆఫీసుల్లో మీటర్ రీడర్స్ అర్హతను బట్టి కంప్యూటర్ ఆపరేటర్స్‌గా, అటెండర్స్‌గా, వాచ్‌మెన్‌గా నియ మించాలని కోరారు. ప్రతి డివిజన్, సబ్ డివిజన్ పరిధిలో బ్రేక్ డౌన్ గ్యాంగ్ మీటర్ రీడర్స్‌ను ఉప యోగించుకోవాలని, ఎంఆర్‌టీలో స్కిల్డ్ అండ్ అన్ స్కిల్డ్ వర్కర్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. మూడు కంపెనీల పరిధిలో ఒకే పని దినాలు అమలు చేయాలని, అదనపు పని గంటలను రద్దు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చెల్ల బోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, వై.వి. ఆనంద్, ఎం.లక్ష్మిపతి, బి. శ్రీనివాసరావు, పెను మాక జాకబ్, నెక్కంటి సుబ్బారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం

వీరవాసరం: కళలు వినోదం కోసమేనని, ఒక నాడు కళలు ప్రజలను చైతన్య పర్చడంలో కీలక పాత్ర పోషించాయని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. వీరవాసరం కళాపరిషత్ 11వ వార్షిక అఖిల భారత నాటిక పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. నాటిక పోటీల సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రారంభో త్సవానికి కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని పలు ప్రాం తాల్లో నేటికీ నాటక పరిషత్‌లు ఏర్పాటుచేసి అంత రించిపోతున్న నాటక రంగాన్ని బతికిస్తుండటం అభినందనీయమన్నారు. ఎంతో ప్రయాసల కోర్చి నాటక పరిషత్‌లు నిర్వహించడం సామాన్య మైన విషయం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు కళలను ప్రోత్రహిస్తున్నాయన్నారు. అనం తరం నరసాపురం వైఎన్ కళాశాల సెక్రటరీ కర స్పాండెంట్ చినిమిల్లి సత్యనారాయణ, ఆం ధ్రప్రదేశ్ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావును కళాప రిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రారంభోత్సవం సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న చిన్నారులను కేంద్ర మంత్రి అభినందించారు.

## ఏపీపీఎస్సీ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు

భీమవరం: ఈ నె 25 నుంచి జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో భీమవరంలోని డీఎన్ఆర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, డీఎన్ఆర్ కాలేజ్ అటానమస్, వాసవి ఇంజనీరింగ్ కాలేజ్ తాడేపల్లిగూడెంలో పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులను ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల మధ్య మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. హాల్‌టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్ప నిసరిగా తీసుకురావాలి చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు, వైద్య శిబిరాలు, తాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అధికా రులు, రెవెన్యూ, విద్యుత్, పోలీస్, మున్సిపాలిటీ, ఆర్టీసీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 27న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం: భీమవరంలో ఈనెల 27న నిర్వహించే ఉద్యోగ దిక్సూచి కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగ రాణి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ రూపొందించిన ఉద్యోగ దిక్సూచి సమాచార వాల్ పోస్టరు ఆవిష్కరించిన సం దర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలోని యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా మెగా ఉద్యోగ దిక్సూచిని పట్టణంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని సీఎస్ఎన్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో నిర్వహించను న్నట్లు చెప్పారు. సుమారు 17 ప్రముఖ కంపెనీలతో పాటు ఇతర కంపెనీల్లో సుమారు 700పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. అదనపు సమాచారం కోసం 94418 41622, 95020 24765 నెంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

## ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలి



దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన దరఖాస్తుల సత్వర పరిష్కారానికి కొంత సమయం కేటాయించి ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెం దిన 241 మంది వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లో తిరిగి రాకుండా సంతృప్తికరమైన నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని ఆదేశించారు. మండల స్థాయిలోనే అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపితే జిల్లా స్థాయి వరకు ఎందుకు వస్తారని కలెక్టర్ నాగరాణి ప్రశ్నించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## డీఎన్నార్‌లో యూత్ పార్లమెంట్



డీఎన్నార్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం : దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వ హించటం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మేలు జరుగుతుందని ప్రధానంగా ఎన్నికల ఖర్చు తగ్గి పెద్ద ఎత్తున అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయవచ్చని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్ర మల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. సోమవారం భీమవరం డీఎన్నార్ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), ఎమ్మెల్సీ బి.గో పిమూర్తి మాట్లాడుతూ 2047 నాటికి దేశాభివృద్ధి లక్ష్యంతో ప్రధాని మోదీ వికసిత్ భారత్ ప్రారం భించారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్య క్షుడు గోకరాజు పాండు రంగరాజు, డివైఈఓ డి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు 308 కేంద్రాలు



భీమవరం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: ధాన్యం కొనుగోలుకు జిల్లాలో ముం దుగా తాడేపల్లిగూడెంలో ధాన్యం కొనుగోలు కేం ద్రం ఏర్పాటు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్ట రేట్‌లో దాళ్వా సీజన్ ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై సివిల్ సప్లయిస్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 308 రైతు సేవా కేంద్రాల ద్వారా ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు చేప ట్టామన్నారు. మండల వ్యవసాయ అధికారులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన మౌలిక సదుపాయాలు సరి చూసుకుని సరైన నిర్ధారణతో సర్టిఫికెట్ అందచే యాలని ఆదేశించారు. సాధారణ రకం క్వింటాకు రూ.2,300, ఏ గ్రేడ్ రకానికి రూ.2,320 ధర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గోనె సంచులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని వాహనాలు, హమాలీలను ముందుగా సిద్ధం చేసు కోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కళ తప్పిన కొల్లేరు


ఎప్పుడూ నీటిలో ఉండే పక్షి ఇలా ..

**ఆసియా ఖండంలోనే అతి పెద్ద మంచినీటి** సరస్సు అయిన కొల్లేరు నీరు లేక ఎండమావులను తలపిస్తోంది. ఎప్పుడూ నిండు కుండలా ఉండే కొల్లేరులో కనుచూపు మేర నీటి జాడ లేదు. సరస్సులో ఈత కొట్టే పక్షులు నీటి కోసం అల్లాడుతున్నాయి. నీరు ఉంటే సహజసిద్ధంగా చేపలను వేటాడి పొట్ట నింపుకునే పక్షులు ఆకలితో దిక్కులు చూస్తున్నాయి. అనధికారిక చేపల చెరువులు నీరు నింపుకోవడంతో కొల్లేరుకు ఈ దుస్థితి పట్టిందని కొల్లేరు వాసులు చెబుతున్నారు. మార్చిలోనే ఈ పరిస్థితి ఉంటే ముందుముందు ఎలా ఉంటుందోనని కొల్లేరు వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు


నీళ్లు లేక అల్లాడుతున్న పక్షులు


నీరు లేక ఎడారి తలపిస్తున్న కొల్లేరు


నీటిలో ఉండే మావి ఇలా


ఆ కాస్త నీటిలోనే సేద తీరుతూ..

## క్లుప్తంగా

### ప్రమాదవశాత్తు గోదావరిలో జారిపడి వ్యక్తి మృతి


సురేష్‌బాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెనుగొండ: సిద్ధాంతం వశిష్టా గోదావరిలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి జారిపడి మృత్యువాత పడ్డాడు. పెనుగొండ మండలం రామన్నపాలెంకు చెందిన బాలిశెట్టి సురేష్ బాబు (37) పాత ఇనుము వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పాత ఇనుము కొనుగోలు నిమిత్తం బాబాయి సూరిబాబుతో ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. సిద్ధాంతం చేరుకొని బహిర్భూమి కోసం ఉదయం 7.30 గంటలకు సిద్ధాంతం గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. సమీపంలో జాలర్లతో వెతికించినా ఫలితం లేకుండా పోయింది. ఉదయం 10 గంటలకు సురేష్‌బాబు మృతదేహాన్ని కనుగొన్నారు. మృతుడుకి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పెనుగొండ ఎస్సై కే గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 30న శ్రీవారి క్షేత్రంలో ఉగాది వేడుకలు


ఉగాది ఉత్సవానికి ముస్తాబవుతున్న మండపం

ద్వారకాతిరుమల: నూతన సంవత్సరాది పర్వదినానికి శ్రీవారి క్షేత్రం ముస్తాబవుతోంది. ఈ ఏడాది ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా సోమవారం స్థానిక ఉగాది మండపానికి రంగులు వేసే పనులను ప్రారంభించారు. అలాగే మండప పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తున్నారు. ఈనెల 30న విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ఉభయ దేవేరులతో శ్రీవారు ఆలయం నుంచి వెండి శేష వాహనంపై ఊరేగింపుగా మండపం వద్దకు వెళ్తారు. అక్కడ మండపంలో ఏర్పాటు చేసిన సింహాసనంపై కొలువై భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణము జరుపుతారు. ఆ తరువాత పండిత సత్కారం, తీర్థప్రసాద వినియోగం జరుగుతుందని, భక్తులు ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆలయ ఈఓ సత్యన్నారాయణ మూర్తి కోరారు.

# హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

- బోసుబాబు హత్యకేసును ఛేదించిన పోలీసులు
- కేసుకు సంబంధించి ఇద్దరి అరెస్ట్


బోసు హత్యకేసులో నిందితుడిని అరెస్ట్ చేసి కేసు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెంలో సంచలనం రేకెత్తించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గంధం బోసుబాబు హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు ఎటువంటి రాజకీయ సంబంధం లేదని, వివాహేతర సంబంధం కారణంగానే హత్య జరిగినట్లు పోలీసులు తేల్చారు. బోసు బాబు భార్య శాంతికుమారి తనకు మేనమామ వరుసైన సొంగా గోపాలరావుతో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఈ కేసుకు సంబంధించి జీలుగుమిల్లి సీఐ బి. వెంకటేశ్వరరావు, ఎస్సై నవీన్‌కుమార్ సోమవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు.

**భర్త పెట్టే బాధలు భరించలేక**

గంధం బోసుబాబు భార్య శాంతికుమారి, తన మేనమామ వరుసైన గోపాలరావు వివాహానికి ముందే ప్రేమించుకుని పెళ్లి చేసుకోవాలనుకున్నారు. అయితే ఇరువురి పెద్దలు అంగీకరించకపోవడంతో వీరిద్దరూ వేర్వేరు వివాహాలు చేసుకున్నారు. వివాహమైన అనంతరం శాంతికుమారి తన భర్తకు తెలియకుండా గోపాలరావుతో వివాహేతర సంబంధం కొనసాగించింది. బోసు ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేసే సమయంలో వేరే అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకుని శాంతికుమారిని మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. ఎన్నికల సమయంలో బెట్టింగ్‌లు కట్టి డబ్బులు పోగొట్టుకుని అప్పులపాలయ్యాడు. అంతేకాకుండా భార్య శాంతికుమారి వద్ద ఉన్న డబ్బులు కూడా బలవంతంగా తీసుకున్నాడు. తరచూ తనను హింసించడంతో భర్త బోసుబాబు అడ్డు తొలగించాలని శాంతికుమారి, గోపాలరావు నిర్ణయించుకున్నారు. సమయం కోసం ఎదురు చూస్తుండగా జగదాంబ అమ్మవారి తిరునాళ్లలో జరిగిన అవకతవకలపై పత్రికలో వచ్చిన కథనాలను ఆమె భర్త బోసు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసిన విషయమై అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావు బోసును ఫోన్‌లో బెదిరించిన కాల్ రికార్డ్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ సమయంలో తన భర్త బోసుబాబును ఏం చేసినా అది చిర్రి వెంకటేశ్వరరావు మీదకు వెళ్తుందనే ఉద్దేశంతో ఈ నెల 17వ తేదీ శాంతికుమారి గోపాలరావును రాత్రి ఇంటికి రమ్మని మెసేజ్ పెట్టింది. తర్వాత బోసు, పిల్లలు ఇంటి పోర్షన్ బయట వరండాలో పడుకుని పూర్తిగా నిద్రలోకి వెళ్లిన తర్వాత శాంతికుమారి సాయంతో గోపాలరావు తనతోపాటు తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో బోసు తలపై కుడి వైపున ఇనుపరాడ్డుతో బలంగా కొట్టాడు. తర్వాత అక్కడి నుంచి గోపాలరావు ఆ రాడ్డుతో పారిపోయాడు. ఈ ఘటనపై ఈనెల 18వ తేదీన తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేయగా భర్త బోసు పెట్టే బాధలు భరించలేకే శాంతికుమారి, గోపాలరావు వివాహేతర సంబంధం కొనసాగించేందుకు ఈ హత్య చేసినట్లు ముద్దాయిలిద్దరూ అంగీకరించారని సీఐ తెలిపారు. అలాగే హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్డును, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కాగా ఈ కేసు దర్యాప్తుకు సహకరించిన కై కలూరు రూరల్ సీఐ, పోలవరం, గణపవరం సీఐలు, చాట్రాయి, ముదినేపల్లి, కొయ్యలగూడెం ఎస్సైలు, సర్కిల్ సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

### అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

అత్తిలి: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు సోమవారం చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. అత్తిలి మండలం కొమ్మర ఉప్పరగూడెంకు చెందిన మడవల్లి సత్యశ్రీకన్యకు, నరసాపురం మండలం చిట్టవరం గ్రామానికి చెందిన ఆదినారాయణతో 2015లో వివాహమైంది. వివాహ సమయంలో కట్నంగా రూ.6 లక్షలతో పాటు ఆడపడుచు కట్నం కింద రూ.1.50 లక్షలు, సారె కింద రూ.2 లక్షలు ఇచ్చారు. కొంత కాలం కాపురం సజావుగా సాగగా వీరికి ఆడపిల్ల పుట్టింది. నాలుగు నెలల క్రితం భర్త, అత్తమామలు, ఆడపడుచులు అదనపు కట్నం రూ.4 లక్షలు తీసుకు రమ్మని సత్యశ్రీకన్యను ఇంటినుంచి బయటకు గెంటివేయడంతో ఆమె పుట్టింటికి వచ్చినట్లు ఎస్సై తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆదినారాయణతో పాటు అతని కుటుంబ సభ్యులు ఎనిమిది మందిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.



# ఆ పార్టీలను మట్టిలో కలిపేస్తాం

ఎస్సీ వర్గీకరణపై పీవీ రావు మాల మహానాడు ధ్వజం


అనిల్‌కు నియామకపత్రం అందజేస్తున్న గుమ్మాపు

యలమంచిలి: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మనుగడ లేకుండా మట్టిలో కలుపుతామని పీవీ రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాదరావు హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం యలమంచిలిలో మాల మహానాడు సమావేశం నిర్వహించారు. ముందుగా బాబా సాహెబ్ డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుమ్మాపు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు మాలలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరగదని తెలిసి కూడా రాజ్యాంగ విరుద్ధమైన పనులకు మద్దతు ఇవ్వడమంటే, కేవలం ఓటు బ్యాంకు రాజకీయ పరమైన కుట్ర అని ఆరోపించారు. రాష్ట్రంలో అన్నదమ్ములుగా కలిసి ఉన్న మాల, మాదిగలను విడగొట్టాలని 1997–98లో నారా చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. అప్పుడు మాలల పంతం చంద్రబాబు అంతం అనే నినాదంతో ఆ రోజు అధికారం కోల్పోవటం జరిగిందన్నారు. ఆ సంఘటన మర్చిపోయి మళ్లీ కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను తెరపైకి తెచ్చి కేవలం మాలలను కించపరుస్తున్నారని ఆయన ఆరోపించారు. పూర్తిగా అవాస్తవంతో కూడిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను రద్దు చేసి, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో త్రిసభ్య కమిటీ వేసి విచారణ చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణను నిలిపివేసి ప్రస్తుతం పెరిగిన జనాభా నిష్పత్తి ప్రకారం 15 శాతం ఉన్న రిజర్వేషన్ శాతాన్ని 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమాన్ని బలోపేతం చేసే దిశగా యలమంచిలి మండల యూత్ విభాగం అధ్యక్షుడుగా జల్లి అనిల్‌ను నియమించి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పితాని పుష్పరాజ్, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ కార్యదర్శి బండి సుందరరామూర్తి, నియోజకవర్గ కన్వీనర్ బుంగా జయరాజ్, ఎస్సీ ఉద్యోగుల సంఘం మండల నాయకులు ముడకల గోపాలరావు, బొంద బుజ్జిబాబు, కప్పల బన్నీ, సోడగిరి ప్రదీప్, జల్లి విజయరాజు, రాపాక సుధీర్, తోట ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



### తమ్ముడిని చంపిన అన్నకు ఏడేళ్ల జైలు

పెంటపాడు: ఆస్తితగాదాల నేపథ్యంలో తమ్ముడిని హత్య చేసిన అన్నకు తాడేపల్లిగూడెం ఏడీజే కోర్టు న్యాయమూర్తి షేక్ సికిందర్ ఏడేళ్ల జైలుశిక్ష విధించారు. పెంటపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకుతీగపాడు ఎస్సీకాలనీకి చెందిన చిన్నం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు (28) అన్నదమ్ములు. వీరు ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్‌లలో నివాసం ఉంటున్నారు. ఇద్దరి మధ్య ఆస్తితగాదాలు ఉండేవి. ఈ క్రమంలో 2024 జనవరి 9న అన్నదమ్ముల మధ్య ఘర్షణ చెలరేగడం, అన్న చిన్నం శ్రీనివాస్ తమ్ముడైన వెంకటేశ్వర్లుపై కత్తితోదాడి చేశాడు. ఈ దాడిలో వెంకటేశ్వర్లుకు మెడపై బలమైన గాయం కావడంతో ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై అప్పటి ఎస్సై హరికృష్ణ హత్యకేసుగా నమోదు చేశారు. అనంతరం గూడెం డీఎస్పీ విశ్వనాథ్, గ్రామీణ సీఐ రమేష్ పర్యవేక్షణలో ఎస్సై స్వామి, ఏఎస్సై యు.రాజేందర్ పీపీ శివరామకృష్ణ కోర్టులో వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో సోమవారం గూడెం కోర్టు ముద్దాయి శ్రీనివాస్‌కు ఏడేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై స్వామి తెలిపారు.

### హస్తకళా ఉత్పత్తులకు అంతర్జాతీయంగా డిమాండ్


హ్యాండీక్రాఫ్ట్‌ను తిలకిస్తున్న జేసీ రాహుల్‌కుమార్


నరసాపురం రూరల్: హస్తకళా ఉత్పత్తులన్నీ మనసు దోచుకునేలా ఉన్నాయని, నరసాపురం ప్రాంతంలో హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో నిర్వహించడం మన ప్రాంతానికి గర్వకారణమని జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం నరసాపురం మండలంలోని రుస్తుంబాద గ్రామంలో అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎల్‌టీసీ)లో ఈపీసీహెచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని జేసీ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హస్తకళాకారులు తయారు చేసిన వస్తువులకు దేశవ్యాప్తంగానే కాకుండా విదేశాల్లో సైతం మార్కెటింగ్ ఉందన్నారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల నుంచి సుమారు 70 హస్తకళా ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శించడం, అమ్మకాలు సాగించడం ద్వారా వాటి గురించి మరింత ప్రాచుర్యం జరుగుతుందన్నారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించని వారు మంగళవారం చివరిరోజున అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. మన ప్రాంత లేసు అల్లికలు, కళంకారి, కొండపల్లి, ఏటి కొప్పాక బొమ్మలు, ఉప్పాడ చీరలు, బొబ్బిలి వీణలు ఇలా ఎన్నో హస్తకళలు ఉన్నాయన్నారు. ఈయన వెంట ఈపీసీహెచ్ సదరన్ రీజియన్ కోఆర్డినేటర్ కలవకొలను తులసి ఉన్నారు.

### పసల కృష్ణభారతి యువతకు ఆదర్శనీయం


మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : గాంధేయవాది, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పసల కృష్ణ భారతి నేటి యువతరానికి ఆదర్శనీయమని రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. కృష్ణభారతి మృతిపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మిల రెండో కుమార్తె కృష్ణభారతి తల్లిదండ్రుల అడుగుజాడల్లో పయనించి స్వాతంత్ర్య సమరయోధురాలిగా నిలిచారని అన్నారు. ఆమె వృద్ధాశ్రమాలను స్థాపించి నిరాశ్రయులైన వృద్ధులకు తోడుగా నిలిచి సేవా తత్పరత కలిగిన మహిళగా ప్రసిద్ధి పొందారని మాజీ మంత్రి కొట్టు తెలిపారు. ఆమె కుటుంబం తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన వారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. కృష్ణభారతి కుటుంబంతో తమకు బంధుత్వం ఉందని గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కృష్ణభారతి పోషించిన కీలక పాత్రను తెలుసుకుని ప్రధానమంత్రి నరేంద్రమోడి స్వయంగా ఆమె పాదాలకు నమస్కరించడం ఆమె ఔన్నత్యానికి నిదర్శనమన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కృష్ణభారతి కుటుంబ సభ్యులకు కొట్టు సత్యనారాయణ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

### హిందూ ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


ప్రసంగిస్తున్న భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ

అత్తిలి: హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ పిలుపునిచ్చారు. సోమవారం అత్తిలి టీటీడీ కల్యాణ మండపంలో హైందవి, శ్రీహనుమాన్ శక్తిజాగరణ సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామజపయజ్ఞం–పూర్ణాహుతి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం విశ్వక్సేనపూజ, మండపారాధన, హోమాలు, శ్రీరామ జపయజ్ఞం మంగళవాయిద్యాల నడుమ వైభవోపేతంగా జరిగింది. సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ, హనుమాన్‌చాలీసా పారాయణం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ అనంతలక్ష్మి, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామంజనేయచౌదరి, శివశక్తి ఆధ్యాత్మిక చైతన్య వేదిక అధ్యక్షుడు కరుణాకర్ సుగ్గున, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, శ్రీరామ జపయజ్ఞ నిర్వహణ సమితి సభ్యులు సాధనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సూరంపూడి కామేష్



తణుకు అర్బన్: తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది సూరంపూడి కామేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత రెండు సార్లు బార్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా భారీ మెజారిటీతో గెలిచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన నేపథ్యంలో మూడోసారి కూడా హ్యాట్రిక్ మాదిరిగా బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు, సభ్యులు తిరిగి తనను ఎన్నుకున్నట్లు కామేష్ తెలిపారు. ఈసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందని, తనపై నమ్మకం ఉంచి ఈ గౌరవం అందించినందుకు అసోసియేషన్ న్యాయవాదులకు కృతజ్ఞుడిగా ఉంటూ మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

### వర్తక సంఘం అధ్యక్షుడిగా చినిమిల్లి సాంబ



నూతన కార్యవర్గాన్ని సత్కరించిన దృశ్యం

తణుకు అర్బన్: తణుకు నీరుల్లి పచ్చిమిర్చి కూరగాయల హోల్‌సేల్ వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చినిమిల్లి సాంబ శివరావు (సాంబ), ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి రామచంద్రరావు, కోశాధికారిగా పసుపులేటి వెంకటేశ్వరరావు (పీఆర్ శ్రీను)లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని సభ్యులకు అండగా నిలబడతామని స్పష్టం చేశారు. అనంతరం సంఘ సభ్యులు నూతన కార్యవర్గ నాయకులను పూలమాలలవేసి సత్కరించారు.

### కాంట్రాక్టు సిబ్బంది టెండర్లపై చర్యలు తీసుకోవాలి

పెంటపాడు: వచ్చే నెల నుంచి సంవత్సరం పాటు పంచాయతీ కాంట్రాక్టులో ఉన్న లోపాలను సరిచేయాలని కోరుతూ కొండేపాడుకు చెందిన సామాజిక వేత్త గోడే వీరాస్వామి సోమవారం మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండేపాడు గ్రామ పంచాయతీలో ఈనెల 20న బోర్డు సమావేశం జరిగిందన్నారు. తీర్మానాల విషయం-54పై అభ్యంతరం వ్యక్తం చేశారు. స్వీపర్లు, పనివారి కోసం టెండర్లు పిలవాలంటే గ్రామంలో టాంటాం వేయించాలన్నారు. దీంతో పాటు, సిబ్బందికి జీతాలు ఇచ్చే సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. అదేమీ లేకుండా ఇష్టానుసారం తీర్మానాలు చేసుకోవడం పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధమన్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో బాలాజీకి, ఈవోపీఆర్డీ ప్రసాద్‌లకు మీకోసంలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

### కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రూప శంకర్ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రావడానికి కృషి చేసిన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రూపశంకర్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం పేరుతో విద్యార్థుల మనో భావాలను దెబ్బతీస్తున్నారని, విద్యార్థులకు శాస్త్రీయ విద్యా విధానం పెంపొందించే విధంగా విద్యాలయాలు, యూనివర్శిటీలు పనిచేయాలన్నారు. ఎస్సీ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నాయకులు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు అభినందనలు

తణుకు అర్బన్: కడప జిల్లా పులివెందులలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించిన 34వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ స్టేట్‌మీట్‌లో పశ్చిమగోదావరి జిల్లా కబడ్డీ జట్టు 3వ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమరెడ్డి శ్రీకాంత్ తెలిపారు. 13 జిల్లాల నుంచి జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో 13 సంవత్సరాల అనంతరం జిల్లా జట్టు 3వ స్థానాన్ని దక్కించుకోగలిగిందని వివరించారు. ఈ సందర్భముగా శ్రీకాంత్‌తోపాటు క్రీడా కారులను తణుకు శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ, బసవ రామకృష్ణ అభినందించారు.

### దళితులపై దాడులు సరికావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన నిందితులను పట్టుకోని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఖండించారు. పట్టణంలోని తాలూకా ఆఫీస్ సెంటర్‌లో సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. మతాల మధ్య, కులాల మధ్య వైషమ్యాలు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారని, విగ్రహాలు వద్ద సీసీ కెమెరాలు పెట్టాలన్నారు. మహిళా కార్యదర్శి విజయకుమారి, మరపట్ల రాజు, మానుకొండ నాగేశ్వరరావు, గోపి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మూసుకుపోతున్న మురుగు డ్రెయిన్లు



పెదతాడేపల్లి చెరువు వద్ద మురుగు డ్రెయిన్‌లో పేరుకుపోయిన జమ్ము కర్ర



చినతాడేపల్లి గ్రామాల్లో ఆక్రమణకు గురైన మురుగు డ్రెయిన్



పెదతాడేపల్లి నుంచి జగన్మోహనపురం వెళ్లే డ్రెయిన్ పరిస్థితి

- చెత్తా చెదారాలు, ఆక్రమణల పర్వం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: మురుగు డ్రెయిన్లు, చెత్తా చెదారాలతో ఏ గ్రామం చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్టుగా తయారయ్యాయి. తాడేపల్లిగూడెం మండలంలోని ప్రధాన మురుగు కాలువలు చెత్తా, చెదారాలకు నిలయాలుగా మారాయి. దీంతో మురుగు నీరు ముందుకు ప్రవహించని పరిస్థితి. అంతే కాకుండా పలు గ్రామాల్లో అంతర్గత డ్రెయిన్లు సైతం సక్రమంగా లేకపోవడంతో రోడ్లపై మురుగు నీరు ప్రవహించే పరిస్థితి నెలకొంటుంది. చినతాడేపల్లి, కడియద్ద, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం, పెదతాడేపల్లి, వెంకట్రామన్నగూడెం, రామన్నగూడెం, జగ్గన్నపేట, వెంకట్రావుపాలెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాథపురం తదితర గ్రామాల్లోని అంతర్గత కచ్చా డ్రెయిన్లు కానరాకపోవడం గమనార్హం. డ్రెయిన్లు పూడికతీత పనులకు నోచకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. దీనికితోడు ప్రధాన డ్రెయిన్లు సైతం చెత్తా, చెదారాలు, గుర్రపు డెక్క, జమ్ము కర్రలతో మూసుకుపోతున్నాయి. ప్రస్తుతం ఎండా కాలం కావడంతో ఈ డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్ట్, చెత్తా, చెదారాలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే రానున్న వర్షాకాలంలో గ్రామాలు చెరువులను తలపించే అవకాశాలు లేకపోలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఉపాధి పథకంలో పూడిక తీయాలి



గ్రామాల్లోని కచ్చా డ్రెయిన్లు, ప్రధాన డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను ఉపాధి హామీ పథకంలో తొలగించాలి. తద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయి. లేకుంటే మురుగు తాండవిస్తుంది.

– బండారు వెంకటేశ్వరరావు, అప్పారావుపేట, తాడేపల్లిగూడెం

### నెలాఖరు లోపు పూర్తి చేస్తాం



గ్రామాల్లో ప్రతీ రోజూ 1,250 పనిదినాలు కల్పించాలని డ్వామా పీడీ ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి ఉపాధిహామీ పథకంలో డ్రెయిన్లలో పూడికతీత పనులు పూర్తిచేస్తాం. 2025–26 సంవత్సరానికి సంబంధించి 31పంచాయతీల్లో 160పనులు గుర్తించాం. తద్వారా 1.62 లక్షల పనిదినాలు కల్పిస్తాం. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తాం.

– జే.థామస్, ఇన్‌చార్జి ఏపీవో, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, తాడేపల్లిగూడెం

## న్యాయవాదుల నిరసన



తణుకులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తణుకు అర్బన్: చింతలపూడిలో మహిళా న్యాయవాది జి.వనితపై దాడి చేసినవారిని వెంటనే అరెస్టు చేయాలని తణుకు బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ భవనం ముందు న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుగు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ న్యాయవాది వనిత తన కోర్టు విధులను పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తుండగా కొంతమంది మహిళలు ఆమెపై కక్ష పెట్టు కొని దాడి చేశారని ఇది అరాచకమని అన్నారు. ప్రజలకు న్యాయాన్ని అందించాలని న్యాయవాది వృత్తిలో ఉన్న మహిళలపై దాడి చేయడం సిగ్గుచేటని అన్నారు. న్యాయవాదుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కలిదిండి పద్మావతి, కామర్స్ కిరణ్మయి, ఎస్కే మోతీ, కౌరు వెంకటేశ్వర్లు, ఎం. మృత్యుంజయరావు, చోగే గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో జాతీయ సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్ చటర్జీ

తణుకు అర్బన్: భారతదేశంలో వ్యవస్థాపకత, సామాజిక ఆర్థిక కోణాలు–చారిత్రక, రాజకీయ దృక్కోణాలు అనే అంశంపై తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో రెండురోజులపాటు నిర్వహించే జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌కు చెందిన ఎన్ఐఆర్‌డీ అండ్ పీఆర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ చటర్జీ మాట్లాడుతూ భారతదేశం సంస్కృతి సాంప్రదాయాలకు పుట్టినిల్లుగా విరాజిల్లుతుందని, ముఖ్యంగా స్త్రీ విద్యపై దేశం ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. అల్పవర్గ ప్రజానీకం అనేక గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నారని, వారినికూడా అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సభ కన్వీనర్ డాక్టర్ కరుటూరి శ్రీరామచంద్రమూర్తి సదస్సు ఉద్దేశ్యాన్ని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, డీసీబీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజరు ఎల్.కుమారస్వామి, డీసీబీ బ్యాంక్ క్లస్టర్ హెడ్ జయరామకుమార్, గ్లోబల్ స్కూలు సెక్రటరీ చిట్టూరి రీనాసాయి, సదస్సు కో కన్వీనర్లు జి.అరుణకుమారి, వి.నాగన్న, ఎం.శ్రీనివాస్, వివిధ కళాశాలల నుంచి వచ్చిన కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# బలుసులమ్మకు విశేష పూజలు



బలుసులమ్మ అమ్మవారికి పుట్టింటి పొన్పు సమర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి దేవస్థానము ఆలయం వద్ద శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా సోమవారం రెండోవ రోజు పుట్టింటి బలుసులమ్మ పార్కు పాశం వారి ఇంటి వద్ద అమ్మవారికి పొన్పు కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాశం కాశీ విశ్వేశ్వరరావు–తులసి విజయలక్ష్మి దంపతులు వారి కుటుంబ సభ్యులచే విశేష పూజలలో పాల్గొన్నారు. బలుసులమ్మ అమ్మవారు పాతూరు ఆడబడుచు కావడంతో పూజా కార్యక్రమానికి స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీరంగం అంజిబాబు పాతూరు యూత్ సభ్యులు పర్యవేక్షించారు. తొలుత అమ్మవారి ఆలయంలోని అమ్మవారికి అర్చకులు ప్రదీప్‌శర్మ, గోపినాథ్‌శర్మ, మల్లిఖార్జున శర్మలచే ఉదయం నుంచి మంగళ వాయిద్యాలలో విశేష పూజలు జరిగాయి. అనంతరం రజకులచే అమ్మవారి గరగలను, పోతురాజు ఘటాన్ని ధరించి, తీన్‌మార్ డప్పులతో, మేళ తాళాలతో, బాణాసంచాతో, గరగ నృత్యాలతో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం పాతూరులో వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పలు ప్రాంతాలలో ఊరేగించి బలుసులమ్మ దేవస్థానం ఆలయం వద్దకు తీసుకువచ్చారు.

# విద్యార్థులకు అభినందనలు



జ్ఞాపికలు, సర్టిఫికెట్స్‌తో విద్యార్థినీలు ఇతర అధ్యాపకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ఫార్మసీ విభాగం విద్యార్థులు అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ప్రొమిలస్ 2025లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు సోమవారం క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్ విద్యార్థినీలకు అభినందనలు తెలిపారు. ఇటీవల భీమవరంలోని విష్ణు కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మౌఖిక, పోస్టర్ ప్రెజెంటేషన్లలో విద్యార్థులకు చురుకుగా పాల్గొన్నారు. పరిశోధన నైపుణ్యాలను ప్రదర్శించారు. ఆదికవి ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు జెస్సీ జాయిసీ, కౌసర్ జహలు పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో అద్భుతమైన విజయాన్ని సాధించారు. జ్ఞాపికలు, సర్టిఫికెట్స్‌ను అందుకున్నారు. అదే విధంగా విజేతలను ప్రత్యేకంగా సన్మానించారు. వివిధ విభాగ అధిపతులు, తదితరులు విజేతలను అభినందించారు.

## క్షయ వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలి



మాధవరం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అత్తిలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



తణుకు అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి టి.సింధు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించి వ్యాధి నిర్ధారణ చేసుకోవాలన్నారు. తద్వారా 6 నెలలపాటు మందులు వాడితే క్షయ వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వీరవెంకటేష్, ఎంపీహెచ్ఈవో జి.వెంకటేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్.అశోక్‌బాబు, సీహెచ్.మణి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**క్షయ వ్యాధికి ఉచితంగా మందులు**

తణుకు అర్బన్: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం తణుకు బ్యాంక్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ఎస్.డానియల్ రాజు రెండు వారాల పైబడి దగ్గు, బరువు తగ్గుతూ ఉండడం, జ్వరం, కఫంలో రక్తం పడడడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలని కోరారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి నివారించుకోవచ్చని వివరించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది క్షయ వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి హెల్త్ సెంటర్స్, ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేయాలని, క్షయ వ్యాధిరహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సునీత, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**క్షయ వ్యాధిపట్ల అవగాహన అవసరం**

అత్తిలి: క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి తగ్గడం, బరువుతగ్గడం, దగ్గినప్పుడు కళ్లెలోరక్తం పడటం వంటివి క్షయ వ్యాధి లక్షణాలు అని, ఈ లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే సరైన చికిత్స తీసుకోవడం ద్వారా తొందరగా స్వస్థత చేకూరుతుందని అన్నారు. చక్కెర వ్యాధిగ్రస్తులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు క్షయ సోకే అవకాశాలు ఎక్కువ అని వైద్యాధికారి నాగరాజు చెప్పారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళి, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రమీలారాణి, హెచ్‌వీ అమ్మాజీ, జెఎస్ గనిరాజు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్ఐ సతీష్

ఇరగవరం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన అవసరమని ఎస్ఐ జానా సతీష్ తెలిపారు. ఎస్పీ ఆదేశాలు మేరకు ఎస్‌డీపీఓ తాడేపల్లిగూడెం సీఐ, తణుకు రూరల్ పర్యవేక్షణలో సోమవారం పల్లె నిద్ర కార్యక్రమం జరిగింది. ఇరగవరం మండలంలోని రాపాక గ్రామంలో ఇరగవరం ఎస్సై జానా సతీష్ గ్రామ ప్రజలతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చట్టాలు గురించి వివరించారు. సోషల్ మీడియా కేసులు, సైబర్ నేరాలు, చిన్న పిల్లలు, మహిళలపై జరిగే నేరాలు గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అందరూ సమన్వయంతో పనిచేయాలి



బంగారుగూడెంలో జరిగిన వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని బంగారుగూడెం గ్రామంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు ప్రతీ ఒక్కరూ శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారు. అందరి కృషితోనే రాబోయే కాలంలో పార్టీని అధికారంలోకి తీసుకురాగలమన్నారు. అనంతరం గ్రామ కమిటిని నియమించారు. నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి కనుపూరి ఉదయభాస్కర్, సిర్రాపు శాంతకుమార్, మండల నాయకులు బుర్ల వెంకట సత్యనారాయణ, ముప్పిడి భాస్కర్‌రెడ్డి, బొట్టా రామచంద్రరావు, నున్నా గెరటరాజు, బుర్ల వెంకట్రామయ్య, బుర్ల వెంకటేశ్వరరావు, బుర్ల శేషారావు, బుర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి



రేలంగిలో ఉపాధి కూలీల నిరసన చేస్తున్న దృశ్యం

ఇరగవరం: ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు విమర్శించారు. రేలంగి పంచాయతీ పరిధిలో కేతా వారి పాలెంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు పనిచేసినప్పటికి వేతనాలు చెల్లించకపోవడంపై కూలి పని చేసుకుని బతికే మాలాంటి వారి పరిస్థితి ఏమిటనే వీరభద్రరావు వద్ద కూలీలు సమస్యను చెప్పి వాపోయారు. ఈ సందర్భంగా కూలీలను ఉద్దేశించి వీరభద్రరావు మాట్లాడుతూ పేద కూలీలకు పని కల్పించేందుకు ఉపాధి హామీ పేరుతో బడ్జెట్లో కేటాయించిన నిధులను పని చేసిన కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా వాటిని దారి మళ్లించి కూలీల పొట్ట కొట్టడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యవహారం చేస్తుంటే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి ఎత్తివేయాలని కుట్ర చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేతా అరుణ, పిచ్చెట్టి శ్యామల, గుడాల కనకదుర్గ, కేతా శివన్నారాయణ, దొమ్మేటి రామకృష్ణ, కేతా రాంబాబు, లక్ష్మి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# శునకాలు, పశువులకు స్కిన్ అలర్జీలు

- 30 శాతం వీధి శునకాలకు డిసీజ్
- పశువుల్లోనూ కనిపిస్తున్న వైనం
- భయపడుతున్న ప్రజానీకం



తణుకులో చర్మవాధితో వీధి శునకం



తణుకులో చర్మ వ్యాధితో గిత్త



తణుకులో చర్మ వాధి సోకి బొచ్చు పూర్తిగా ఊడిపోయిన శునకం

తణుకు అర్బన్: చర్మ వ్యాధులతో (స్కిన్ డిసీజ్) వీధి శునకాలు, ఆవులు, గిత్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. వీధుల్లో తిరుగుతున్న ఈ తరహా శునకాలు, ఆవులు, గిత్తలు వ్యాధిబారిన పడిన వాటి కదలికలు ప్రజానీకాన్ని భయపెడుతున్నాయి. ముఖ్యంగా స్కిన్ డిసీజ్ బారిన పడ్డ వీధి శునకాల్లో బొచ్చు రాలిపోతూ చర్మంపై పుండ్లు ఏర్పడి తీవ్ర జుగుప్సాకరంగా మారాయని ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు. ఆవుల్లో లంపీ స్కిన్ డిసీజ్ బారిన పడి ఒంటిపై విపరీతంగా పుండ్లు పడిపోయి రసి కారిపోతూ తీవ్ర వేదన పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వ్యాధిబారిన పడ్డ శునకాలు ఇళ్లలోకి వస్తుంటే ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. వాటి కారణంగా పిల్లలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయోనని భయపడుతున్నారు.

**బర్డ్‌ఫ్లూ తగ్గు ముఖం పట్టిందంటే..**

రెండు నెలల క్రితం బర్డ్‌ఫ్లూ వ్యాధితో పౌల్ట్రీ రంగం సంక్షోభం ఏర్పడిన విషయం తెలిసిందే. ఆ సందర్భంలో కోళ్లు, చికెన్, కోడిగ్రుడ్లుపై కూడా ఆంక్షలు విధించారు. దీంతో ఇప్పటికీకూడా చికెన్ అమ్మకాలు పూర్తిస్థాయిలో జోరందుకోలేదు. అయితే నేడు తిరిగి శునకాలు, ఆవులు, గిత్తలకు వస్తున్న స్కిన్ డిసీజ్‌లు మానవాళికి ఏరకమైన ఇబ్బందులు తెస్తాయోనని ప్రజానీకం భయాందోళనతో ఉన్నారు.

**తణుకులో 500లకు పైగా శునకాలు...**

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో వీధి శునకాలు 500లకు పైగా రోడ్లపై తిరుగుతుండగా, రహదారుల్లో సంచరించే ఆవులు, గిత్తలు 200లకుపైగా ఉన్నట్లుగా తెలుస్తోంది. వీధి శునకాలకు సంబంధించి 30 శాతం స్కిన్ డిసీజెస్ బారిన పడినట్లుగా తెలుస్తోంది. ఆవుల్లో 10 శాతం బారిన పడ్డాయని అంచనా వేస్తున్నారు. వీధి శునకాలకు వ్యాక్సిన్స్ వేసేందుకు పశు వైద్యులు కార్యాచరణ చేస్తున్నారు. ఆవులు, గిత్తలకు మాత్రం గోసేవా సమితి, పశు పోషకులు పశువైద్యశాలలకు తరలించి వ్యాక్సిన్స్, చికిత్స చేయిస్తున్నారు.

**చికిత్స ఉంది**

వీధుల్లో తిరిగే శునకాలు, ఆవులు, గిత్తల్లో శుభ్రత లేకపోవడం కారణంగానే స్కిన్ డిసీజెస్ సమస్య వస్తుందని దీనివలన మానవాళికి ఎటువంటి ఇబ్బందిలేదని పశు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆవుల్లో తలెత్తే లంపీ స్కిన్ డిసీజ్ రాకుండా వ్యాక్సిన్స్ అందుబాటులో ఉన్నాయని, శునకాల్లో వచ్చే స్కిన్ డిసీజెస్‌కు సంబంధించి పశువైద్యశాలల్లో చికిత్స అందిస్తే సరిపోతుందని వైద్యులు వివరిస్తున్నారు.

## ఘనంగా ఉమా రాజేశ్వరస్వామి కల్యాణం

పెంటపాడు: మండలంలోని పడమర విప్పర్రు గ్రామంలో ఉమా రాజేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా ఆలయ ఈవో బీవీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి యాగబ్రహ్మ బ్రహ్మశ్రీ శంకరమంచి రాజేష్‌శర్మ బ్రహ్మత్వంలో దివ్య కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. తల్లాప్రగడ సత్యనారాయణ, విజయశ్రీ దంపతులు స్వామివారి కల్యాణం కమనీయంగా జరిపించారు. ఉదయం స్వామివారి గ్రామోత్సవం, నందివాహనంపై ఊరేగింపు, నిర్వహించారు. 30న ఉగాది పురస్కరించుకొని బ్రహ్మశ్రీ ధర్బముళ్ల వీరన్నశాస్త్రి చే పంచాంగ శ్రవణం జరుగుతాయన్నారు. పరిసర గ్రామాల భక్తులు ఈ ఉత్సవాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రహదారుల నిర్మాణాల పరిశీలన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామంలో స్టేషన్ మాస్టర్ సత్యనారాయణ, ప్రజావిరాళంతో నిర్మించిన మూడు మెటల్ డస్ట్ రహదారులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంపదను గ్రామ అభివృద్ధి వినియోగించాలన్నారు. ఎస్సీలకు రూ.5లక్షలు, బీసీలకు రూ.2లక్షలు, కాపు శ్మశాన వాటికకు బిల్లులు పెట్టడం జరిగిందన్నారు. గ్రామంలో నిర్మించిన కాపు శ్మశాన వాటిక ఎంతో సుందరంగా ఉందన్నారు. రానున్న నాలుగేళ్ల కాలంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు, మాజీ ఉప సర్పంచ్ చిక్కాల చిరంజీవి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు అడపా ప్రసాద్, పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబి, కార్యకర్తలు మద్దాల మణికుమార్, పైబోయిన వెంకట్రామయ్య, మట్టా రామకృష్ణ, సందక రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వీర రాజేష్ ప్రమాదానికి గురి కావడం వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంజూరైన రూ.1,55,343లు చెక్కును సోమవారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అందజేశారు. జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.